క్లుప్తంగా

త్వరలో మహిళా నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు

కాకినాడ: రెడ్‌క్రాస్ సంస్థ నిర్వహణలో త్వరలోనే ప్రతాప్‌నగర్‌లో శిశు, మహిళాభివృద్ధి నైపుణ్య కేంద్రానికి శాశ్వత భవనం సమకూరనుందని నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు తెలిపారు. ఇటీవల రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన నేపథ్యంలో కమిషనర్ గురువారం భవనాన్ని సందర్శించి పనులు వేగవంతం చేయాలని సూచించారు. జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ వైడీ రామారావు మాట్లాడుతూ రూ.1.3 కోట్ల సీఎస్సార్ నిధులతో శాశ్వత భవనాన్ని నిర్మిస్తున్నామన్నారు. అదే ప్రాంగణంలో శిశు గృహాన్ని నిర్మించి మహిళా శిశు సంక్షేమ విభాగానికి అప్పగిస్తామని చెప్పారు.

వైద్య శిబిరంలో 400 మందికి పరీక్షలు


శిబిరంలో రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

బోట్‌క్లబ్: స్థానిక పెద్ద మార్కెట్ వద్ద ఉన్న ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో గురువారం ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని డీఎస్పీ మురళీకృష్ణ ప్రారంభించారు. లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ లింగమల్లు కృష్ణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన ఈ శిబిరంలో 400 మంది వృద్ధులకు దంత పరీక్షలు చేసి మౌత్‌వాష్‌లు, పేస్టులు అందజేశారు. డాక్టర్ అఖిల కీళ్ల నొప్పులతో ఇబ్బంది పడుతున్నవారికి ఫిజియోథెరపీ చేయించారు. కాకినాడ ఐడీఏ సభ్యులు అడ్డాల సత్యనారాయణ, నాగేంద్ర, వెంకటపతి, నిఖిల, నిరోష, అమరదీప్తి సేవలను అందించారు.

రేపటి నుంచి మాఘ హోమాలు

బోట్‌క్లబ్: మాఘమాసం సందర్భంగా స్థానిక రామారావుపేటలో వేదవిజ్ఞాన ప్రతిష్ఠాన కార్యాలయంలో శ్యామలాదేవి (మాతంగి) నవరాత్రులు సందర్భంగా ప్రత్యేక హోమాలు నిర్వహిస్తున్నట్టు ప్రతిష్ఠాన కార్యదర్శి పుసులూరి ఫణిశర్మ గురువారం తెలిపారు. శనివారం నుంచి 18 వరకు నిర్వహించనున్న ఈ విశేష పూజ, హోమాది కార్యక్రమాలలో భక్తులు పాల్గొనవలసిందిగా ఆయన కోరారు.

నేడు నులిపురుగుల మందు పంపిణీ

కరప: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు, పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులతో ఆల్బెండాజోల్ మాత్రలు మింగించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు మండల వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాసనాయక్ తెలిపారు. కరపలో గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కరప పీహెచ్‌సీ పరిధిలో మూడేళ్లనుంచి 19 ఏళ్లలోపువారు టాబ్లెట్ మూర్తిగా మింగాలన్నారు. అలాగే వేళంగి పీహెచ్‌సీ పరిధిలో విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలు మింగించేందుకు ఏర్పాట్లు చేసినట్లు డాక్టర్ ఎంకే సౌజన్య తెలిపారు.

అంగన్‌వాడీల విజయోత్సవం

కరప: అంగన్‌వాడీల సమ్మె విజయవంతంపై గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా మండల అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు విజయోత్సవ సభ నిర్వహించారు. అనంతరం కేక్ కట్‌చేసి వేడుక చేసుకున్నారు. అంగన్‌వాడీల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబీరాణి తదితరులు పాల్గొన్నారు.

మోడీ విధానాలు దేశానికి ప్రమాదం

కాకినాడ సిటీ: కేంద్ర కార్మిక సంఘాలు, రైతు, వ్యవసాయ, రైతుకూలీ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో 16వ తేదీన జరిగే గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం పిలుపు నిచ్చింది. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్, మతోన్మాద విధానాలు రైతుల పాలిట ఉరితాళ్లుగా మారి ఐదేళ్లలో 3 లక్షల మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని వివరించారు. ఈ సమావేశంలో వివిధ సంఘాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

పొగమంచులో పల్లెలు


ప్రత్తిపాడు-సామర్లకోట ప్రధాన రహదారిలో మంచు

పెద్దాపురం: వేకువ జాము నుంచి కురుస్తున్న పొగమంచుతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గురువారం ఉదయం 8.30 గంటల వరకు పట్టణ, మండలంలోని అన్ని గ్రామాల్లో పొగమంచు పేరుకునే ఉంది. చలి పెద్దగా లేనప్పటికీ గ్రామాలన్నీ మంచు కప్పి ఉండడంతో ఉదయాన్నే విధులకు, స్కూళ్లు, కళాశాలలకు వెళ్లే వారు పొగమంచులోనే ప్రయాణం చేశారు. ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తుపట్టలేక ప్రధాన రహదారిపై నెమ్మదిగానే ప్రయాణించారు. శీతాకాలంలో ఇంత మంచు పేరుకపోవడం ఇదే ప్రథమం.

వేసవికి ముందే నిశ్చింత!

- గ్రామగ్రామానా ఓహెచ్ ట్యాంకులు
- ఇంటింటికీ జల్ జీవన్ కుళాయిలు
- మండలంలో రూ.47.77 కోట్లతో పనులు


ఇటీవల సర్పవరంలో ఇంటింటికీ కుళాయి పథకం కింద తాగునీటి సరఫరా ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు


సర్పవరంలో వినియోగంలోకి వచ్చిన ఓవర్ హెడ్ ట్యాంక్

కాకినాడ రూరల్: వేసవి వదంటే పల్లెలో ప్రజలు తాగు నీటి కష్టాల మొదలవుతాయి. ఒక పూట ముద్ద తినకున్నా పర్వాలేదు గానీ. గుక్కెడు నీళ్లు లేకుంటే బతకలేని పరిస్థితి. ఫిబ్రవరి నెలలోకి ప్రవేశించగానే క్రమేణా చలి తగ్గుతూ ఎండలు ప్రభావం చూపుతున్నారు. రానున్న రోజుల్లో భూగర్భ జలాల మట్టాలు పడిపోయి కుళాయిల ద్వారా తాగునీరు సక్రమంగా అందక మహిళల ఆగ్రహావేశాలు చవిచూడాల్సి వస్తుంది. ఈ ఏడాది నుంచి ఆ పరిస్థితికి చెక్ పెడుతున్నాయి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు. జల్ జీవన్ మిషన్ పథకాన్ని చురుగ్గా అమలు చేస్తూ ప్రజల దాహార్తిని తీరుస్తున్నాయి. కాకినాడను ఆనుకుని చుట్టూ విస్తరించి ఉన్న రూరల్ నియోజకవర్గంలో ఈ వేసవికి ప్రజలు నిశ్చింతగా ఉండడనున్నారు. ఈ పథకం కింద ఓవర్ హెడ్ ట్యాంకులు, పైప్‌లైన్ల నిర్మాణం. ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేయడంతో నీటి ఎద్దడి ఇబ్బందుల నుంచి ప్రజలు బయట పడనున్నారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు నిరంతర పర్యవేక్షణతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు రూ.47.77 కోట్లతో పనులు చేపట్టగా ఇప్పటికే సర్పవరం నేమాం, కొవ్వాడ, తమ్మవరం, ఇంద్రపాలెం, కొవ్వూరు తదితర గ్రామాల్లో ఇంటింటికీ కుళాయిలను ఆయన ప్రారంభించారు. మిగిలిన గ్రామాలలో పనులు పూర్తి కానునున్నాయి.

అందుబాటులోకి రెండు ఓవర్‌హెడ్ ట్యాంకులు



సర్పవరం గ్రామంలో సుమారు రూ.1.38 కోట్లతో రెండు ఓవర్ హెడ్ ట్యాంకులను ఇటీవల ప్రారంభించారు. ఇంటింటికీ తాగునీరు అందుతోంది. కొత్త రెండు ట్యాంక్‌లకు పండూరు సీపీడబ్ల్యూ స్కీమ్ నుంచి నేరుగా వాటరు ట్యాంక్‌లకు అనుసంధానం చేశారు. మరో ట్యాంక్ నిర్మాణం జరుగుతోంది. వేసవిలో పూర్తి స్థాయిలో కుళాయిల ద్వారా నీరు అందుతుంది.

– పుల్ల చందు, గ్రామస్తుడు, సర్పవరం, కాకినాడ రూరల్ మండలం.

పూర్తి స్థాయిలో తాగునీరు



జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో గ్రామాలలో రక్షితనీటి సరఫరా పనులు వేగవంతం చేశాం. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ఇంటింటికి కుళాయి నీటిని అందించే లక్ష్యంతో ఎమ్మెల్యే కన్నబాబు ఉన్నారు. అందుకు అనుగుణంగా పనులు చేపడుతున్నాం.

– మారుతీరామ్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ, కాకినాడ రూరల్

రాష్ట్ర స్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు


రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో ప్రిన్సిపాల్, పీఈటీ

కరప: స్థానిక మహాత్మా జ్యోతిరావు పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయం విద్యార్థులు ముగ్గురు రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ జట్టుకు ఎంపికై నట్టు ప్రిన్సిపాల్ కేవీ రామకృష్ణ గురువారం తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా జంగారెడ్డిగూడెంలో ఈనెల 4, 5, 6 తేదీలలో రాష్ట్రసాయి ఎంపిక కోసం టెన్నికాయిట్ పోటీలో అండర్-14, 17 విభాగాలలో పోటీలు నిర్వహించారన్నారు. ఈ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చూపి ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికయ్యారన్నారు. అండర్-14 విభాగంలో ఆర్.సంతోష్, అండర్-17 విభాగంలో జి.రమణబాబు, పి.ధననరసింహారావు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని, త్వరలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థులను, తర్ఫీదునిచ్చిన పీఈటీని ప్రిన్సిపాల్, గురుకుల విద్యాలయం ఉపాధ్యాయులు అభినందించారు.

అభివృద్ధి, సంక్షేమాలకు పెద్దపీట

- వచ్చే ఎన్నికల్లో జగన్‌ను ఆశీర్వదించండి
- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- రూ.13.42 కోట్ల పనులకు శ్రీకారం


అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న సిటీ ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి తదితరులు

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రజలకు మెరుగైన సంక్షేమాన్ని అందిస్తూనే అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టి సంతృప్తికరమైన సేవలు అందించగలిగామని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. గడచిన నాలుగున్నరేళ్లలో కాకినాడను అభివృద్ధికి చిరునామాగా తీర్చిదిద్దగలిగామన్నారు. రూ.13.42 కోట్ల ఖర్చుతో కాకినాడలోని వివిధ ప్రాంతాల్లో ప్రతిపాదించిన అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ద్వారంపూడి గురువారం శ్రీకారం చుట్టారు. ఆయా అభివృద్ధి పనులకు సంబంధించి ప్రారంభోత్సవాలు, శంఖుస్థాపనలు చేశారు. కౌడా ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు, మాజీ మేయర్, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ ఛైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి తదితర ప్రముఖులు హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా 15వ డివిజన్ ఎర్ర రోడ్డులో కమ్యూనిటీ హాలుకు మరుగుదొడ్ల సదుపాయం, 15వ డివిజన్ ముల్లారమ్మ ఆలయం వద్ద పార్కు అభివృద్ధి పనులను 19వ డివిజన్‌లో గోళీలపేట, ముత్తానగర్‌లలో సీసీ రోడ్లు, కల్వర్టులు ప్రారంభించారు. 23వ డివిజన్‌లో దోబీఖానాకు అత్యాధునిక వసతులకు శ్రీకారం చుట్టారు. అలాగే 20, 22 డివిజన్లలో కూడా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. ఏటిమొగ ప్రాంతం నుంచి నగరంలోకి వచ్చేందుకు ముత్తానగర్ ప్రాంతం నుంచి మరో అంతర్గత రహదారి నిర్మిస్తున్నామన్నారు. గడచిన నాలుగున్నరేళ్ళలో అభివృద్ధి పనులు పూర్తి చేసి సంతృప్తికరమైన సేవలు అందించగలిగామన్నారు. నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, పలువురు డీఈలు, ఏఈలు, మాజీ కార్పొరేటర్లు నాయకులు, కార్యకర్తలు కార్యక్రమానికి హాజరయ్యారు.

యాదవుల సంక్షేమానికి సీఎం తోడ్పాటు

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- కమ్యూనిటీ హాలు అదనపు భవనం ప్రారంభం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యాదవులకు అన్ని విధాలా ప్రాధాన్యం ఇచ్చారని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక 38వ డివిజన్ గొల్లపేటలో రూ.13.5 లక్షలతో నిర్మించిన ఆవుల సుబ్బారావు కమ్యూనిటీ హాలు అదనపు ప్రాంగణ నిర్మాణాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. కమ్యూనిటీ హాలు మొదటి అంతస్తులో సొంతఖర్చులతో కృష్ణుని పాలరాతి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం యాదవులను నిర్లక్ష్యం చేసినప్పటికీ సీఎం జగన్ సముచిత ప్రాధాన్యం ఇచ్చారన్నారు. ఇద్దరికి రాజ్యసభలో అవకాశం ఇచ్చిన సీఎం తాజాగా మరో ఇద్దరికి ఎంపీలుగా పోటీచేసే అవకాశాన్ని కల్పిస్తున్నారన్నారు. అలాగే గత ప్రభుత్వం తొలగించిన సన్నిధి గొల్ల విధానాన్ని సీఎం జగన్ కొనసాగిస్తున్నారన్నారు. యాదవ సామాజిక వర్గం అధికంగా నివసించే నాలుగు ప్రాంతాల్లో కమ్యూనిటీ హాళ్లను సమకూర్చామన్నారు. ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. కౌడా ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎస్ఈ సత్యకుమారి, ఏఎంసీ ఛైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, జిల్లా యాదవ సంఘ అధ్యక్షుడు మన్నే నాగేశ్వరరావు, కాకినాడ పార్లమెంట్ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు అల్లి రాజబాబు, రాష్ట్ర ట్రేడ్ యూనియన్ కార్యదర్శి డీకే రెడ్డి, మాజీ కార్పొరేటర్లు దండుమహంతి లక్ష్మణరావు, ఇనుకొండ పట్టాభిరామయ్య, ఆర్యవైశ్య మహాసభ అర్బన్ జిల్లా అధ్యక్షుడు బాదం మధు, డివిజన్ ఇన్‌చార్జి చౌదరి, పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

రేపు ఇళ్ల పట్టాల పంపిణీ


అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ వెంకటరావు, ఏడీసీ నాగ నరసింహారావు

కాకినాడ: కార్పొరేషన్ పరిధిలోని ఎనిమిది రూరల్ డివిజన్లకు సంబంధించి నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల పథకంలో సుమారు 2812 మందికి పదో తేదీన ఇళ్ల పట్టాలు పంపిణీ చేయనున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు చెప్పారు. ఈ అంశంపై గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, ఇతర అధికారులతో సమావేశమయ్యారు. 10వ తేదీ ఉదయం 9 గంటలకు జేఎన్‌టీయూకే ఎదురుగా ఉన్న శాలరీడ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రాంగణంలో పట్టాల పంపిణీ జరుగుతుందన్నారు. మాజీ మంత్రి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పట్టాలు పంపిణీ చేయనున్నారని చెప్పారు. కార్పొరేషన్ పరిధిలోని 1, 2, 3, 42, 47,48, 49, 50 డివిజన్ల పరిధిలోని లబ్ధిదారులకు ఈ పంపిణీ జరుగుతుందన్నారు. గురజనాపల్లిలో సేకరించిన స్థలాన్ని వీరికి పంపిణీ చేస్తారన్నారు. పట్టాల పంపిణీ ప్రక్రియకు అధికారులు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ నాగశాస్త్రులు, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, సిటీ మిషన్ మేనేజర్ డేగల వెంకటరాజు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

స్థలాల రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయండి

నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల పథకంలో ఇచ్చిన ఇళ్ల స్థల పట్టాలకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు ఆదేశించారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావుతో కలిసి ప్రత్యేకాధికారులతో గురువారం సాయంత్రం సమావేశమయ్యారు. ఆయా సచివాలయాల్లో జరుగుతున్న రిజిస్ట్రేషన్ల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ఆయా ప్రాంతాల ప్రత్యేకాధికారులు పర్యవేక్షించాలని, ఎక్కడైనా సాంకేతిక సమస్యలు, ఇతర ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోను అవాంతరాలు లేకుండా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. సమావేశంలో నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శ్రీనివాస్, తహసీల్దార్ దొర, ఏసీపీ నాగశాస్త్రులు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, పలువురు ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్లలో వసతుల పరిశీలన


మాస్టర్ ట్రైనర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్వో, కమిషనర్ వెంకటరావు

కాకినాడ: పోలింగ్ స్టేషన్లలో మౌలిక వసతులపై నియోజకవర్గ ఈఆర్వో, నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు పలు కేంద్రాల సిబ్బందిని ఆరా తీశారు. గురువారం ఆయన కాకినాడ డైరీఫారం, దుమ్ములపేట, పర్లోపేట, సాంబమూర్తినగర్, రాజాజీ వీధి, సంజయ్‌నగర్ ప్రాంతాల్లోని దాదాపు 40 పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆయా పోలింగ్‌స్టేషన్లలో ఉన్న వసతులను స్వయంగా పరిశీలించారు. విద్యుత్, తాగునీరు, ఫర్నిచర్, ర్యాంపులతో పాటు ఇతర సౌకర్యాలు ఉన్నాయో లేదో ఆరా తీశారు. ఎక్కడైనా సదుపాయాల కొరత ఉంటే తక్షణమే తన దృష్టికి తీసుకురావాలని కమిషనర్ ఆదేశించారు. ఆయా సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట సంబంధిత పోలింగ్‌స్టేషన్ల సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు, ఇతర ఎన్నికల సిబ్బంది ఉన్నారు.

ఎన్నికల నిర్వహణపై సమీక్ష

నియోజకవర్గ ఈఆర్వో, నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు గురువారం ఎన్నికల నిర్వహణకు సంబంధించి మాస్టర్ ట్రైనర్లతో సమావేశమయ్యారు. కార్పొరేషన్ కార్యాలయంలోని చాంబర్‌లో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ఎన్నికకు ముందురోజు విధుల్లో ఉండే పీవో, ఏపీవోలు ముందు రోజు చేపట్టాల్సిన కార్యకలాపాలు, మాక్‌పోల్ ఎలా నిర్వహించాలి? పోలింగ్ అనంతరం పూరించాల్సిన దరఖాస్తులు, ఇతర అంశాలపై ఇవ్వాల్సిన శిక్షణకు సంబంధించి చర్చించారు. సుమారు ఏడుగురు ట్రైనర్లతో పీవో, ఏపీవోలకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సమావేశంలో ఎన్నికల ఏఆర్వో గుంటూరు శేఖర్, డిప్యూటీ తహసీల్దార్ మురళీకృష్ణ, ట్రైనర్లు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా వాడండి

- డీపీటీవో శ్రీనివాసరావు
- రహదారి భద్రతపై ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న డీపీటీవో శ్రీనివాసరావు, అధికారులు, కార్మికులు

కాకినాడ: ప్రతి ఒక్కరూ రహదారి భద్రతపై అవగాహన పెంచుకోవాలని జిల్లా ప్రజారవాణాధికారి ఎం.శ్రీనివాసరావు సూచించారు. రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా గురువారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ప్రయాణికులకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని డీపీటీవో శ్రీనివాసరావు ప్రారంభించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వాహనాలు నడిపే సమయంలో విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్, సూపరింటెండెంట్ త్రిమూర్తులు, డిప్యూటీ సూపరింటెండెంట్ ఎస్.స్వామి, అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పెన్షనర్ల దీక్షలు

బోట్‌క్లబ్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పింఛన్‌దారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం ఈపీఎఫ్ కార్యాలయం ఎదురుగా పింఛన్‌దారులు అసోసియేషన్ రిలే నిరహార దీక్షలు చేశారు. సంఘం రాష్ట్ర కోశాధికారి సీహెచ్ సత్యనారాయణ రాజు, ఆలిండియా పోస్టల్ రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి తురగా సూర్యారావు ప్రారంభించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కె సత్తిరాజు జిల్లా సహాధ్యక్షుడు జోగా అప్పారావు, జిల్లా కార్యదర్శి యూఎస్ఎన్ రెడ్డి, పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్పయాత్ర


వికసిత్ భారత్ సంకల్పయాత్రలో పాల్గొన్న అధికారులు, నాయకులు

బోట్‌క్లబ్: కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలపై వికసిత్ భారత్ సంకల్పయాత్ర పేరుతో గురువారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానిక దుమ్ములపేట, గైగోలుపాడు ప్రాంతాల్లో ఈ కార్యక్రమం జరిగింది. నగరపాలకసంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల జీవన ప్రమాణాలు పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అందజేస్తోందన్నారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వికసిత్ భారత్ కేలండర్‌ను కార్యదర్శి ఏసుబాబు, బీజేపీ నాయకులు ఆవిష్కరించారు. అభివృద్ధికి పునరంకితమవుతామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. వివిధ కేంద్ర పథకాలపై ప్రజలకు చైతన్యం కలిగించేందుకు మొబైల్ వాహనం నుంచి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందిస్తున్నాయన్నారు. ప్రజల్లో అవగాహన లేకపోవడం వల్ల వీటిని ఉపయోగించుకోలేక పోతున్నారన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు ఎనిమిరెడ్డి మాలకొండయ్య, గట్టి సత్యనారాయణ, వేటుకూరి సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

నేడు చొల్లంగి తీర్థం


బాలాత్రిపుర సుందరీ సమేత సంగమేశ్వరస్వామి

- ముస్తాబైన సోమేశ్వరస్వామి, సంగమేశ్వరస్వామి ఆలయాలు
- విస్తృత ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీలు


రాజరాజేశ్వరీ సమేత సోమేశ్వరస్వామి

తాళ్లరేవు: చొల్లంగి అమావాస్య పర్వదినం సందర్భంగా చొల్లంగిలో జరగనున్న తీర్థ మహోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేశారు. చొల్లంగిలోని చంద్రప్రతిష్ఠిత లింగమైన శ్రీరాజరాజేశ్వరీ సమేత సోమేశ్వరస్వామి, తుల్యభాగ నదీ తీరాన ఉన్న శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత సంగమేశ్వరస్వామివారి ఆలయాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. సంక్రాంతి తరువాత వచ్చే మాఘ మాసం అమావాస్య రోజున సముద్రస్నానం చేస్తే మోక్షం కలుగుతుందని భక్తుల విశ్వాసం. ఈ నేపథ్యంలో శుక్రవారం తెల్లవారుజామున 2 గంటల నుంచే భక్తులు పవిత్ర తుల్యభాగ నదిలో స్నానాలు ఆచరిస్తారు.

ట్రాఫిక్ మళ్లింపు

చొల్లంగి తీర్థం నేపథ్యంలో కాకినాడ- యానాం రహదారిలో ట్రాఫిక్‌ను మళ్లించినట్లు కోరంగి ఎస్ఐ ఎస్.రవికుమార్ తెలిపారు. యానాం నుంచి కాకినాడ వెళ్లే బస్సులను జాముకాయల తూము నుంచి గొర్రిపూడి మీదుగా కాకినాడకు, అలాగే కాకినాడ నుంచి వచ్చే బస్సులను గురజనాపల్లి మీదుగా యానాం రహదారికి మళ్లించినట్లు తెలిపారు. తీర్థానికి తరలివచ్చే వేలాది మందికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా కాకినాడ సబ్ డివిజన్ నుంచి డీఎస్పీ కె.హనుమంతరావు ఆదేశాల మేరకు కాకినాడ రూరల్ సీఐ కె.శ్రీనివాస్ పర్యవేక్షణలో 8 మంది ఎస్ఐలు, సుమారు 150 మంది సిబ్బందితో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

భక్తులు అప్రమత్తంగా ఉండాలి

తుల్యభాగ నదీ పాయలో పవిత్ర స్నానాలాచరించే భక్తులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రవికుమార్ కోరారు. ఆలయాల్లో క్యూ పద్ధతిని పాటించాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు. అలాగే తీర్థం సందర్భంగా రికార్డింగ్ డ్యాన్స్‌లు, గుండాటలు వంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడొద్దని, నిబంధనలు మీరితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

సమర్థవంతంగా ఇంటింటికీ రేషన్

పెద్దాపురం: ప్రభుత్వం చేపట్టిన ఇంటింటికీ రేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్టు జిల్లా సివిల్ సప్లయి అధికారి ఎంవీ ప్రసాదరావు అన్నారు, పట్టణంలో ఎండీయూ వాహనాల ద్వారా సరఫరా అవుతున్న రేషన్ పంపిణీని గురువారం ఆయన ఎంఎస్ఓ విజయకుమారితో కలిసి పరిశీలించారు. అనంతరం సాంకేతికంగా తలెత్తుతున్న ఇబ్బందులను నివృత్తి చేసుకుంటూ రేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని ప్రసాదరదావు అన్నారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఆడ పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

తుని రూరల్: ఆడ పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దాలని, పెళ్లిళ్ల పేరుతో వారిని చదువులకు దూరం చేయడం తగతని ఐసీడీఎస్ సీడీపీఓ కె.శ్రీలత అన్నారు. మండలంలోని రాజుపేటలో శుక్రవారం సర్పంచ్ బుద్ధాల సత్తిబాబు అధ్యక్షతన బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడ పిల్లలను రక్షించుకోవాలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చిన్నతనంలోనే పెళ్లిళ్లు చేసి బాలికలకు బాల్యాన్ని దూరం చేయ వద్దన్నారు. బాల్య వివాహాల వల్ల బాలికల్లో శారీరక, మానసిక ఎదుగుదల, రక్తహీనత సమస్యలు వస్తాయన్నారు. అమ్మాయిల చదువు ఇంటికి వెలుగు నిస్తుందన్నారు. 22 సంవత్సరాలు వరకు చదివించాలని సూచించారు. ఆడపిల్లలను రక్షిద్దాం, ఆడపిల్లలను చదివిద్దాం అంటూ నినాదాలు చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఎంపీటీసీ గింజాల సుబ్రహ్మణ్యేశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకులు వడ్డాది యేసుబాబు, కిల్లాడ గోవిందు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎంవీటీ కుమారి, బాల వెంకటేశ్వరి, లోవరాణి పాల్గొన్నారు.